

దారి తప్పిన స్పెషల్ డ్రైవ్

పెండింగ్ భూ సమస్యల తక్షణ పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన ధరణి స్పెషల్ డ్రైవ్ దారి తప్పింది. 8లో▸



అప్రమత్తతతో నివారణ

అప్రమత్తతో అగ్ని ప్రమాదాలను నివారించొచ్చని ఏడీఎఫ్ఓ రాజు అన్నారు. ప్రమాదం జరగ్గానే సమాచారం ఇవ్వాలన్నారు. 8లో▸



తాళాలు పగులగొట్టి చోరీ

గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడిన సంఘటన షాబాద్ ఠాణా పరిధిలో జరిగింది. 8లో▸

న్యూస్‌రీల్

హస్తం గూటికి డీసీసీబీ చైర్మన్



సీఎం రేవంత్‌రెడ్డితో డీసీసీబీ చైర్మన్ సత్తయ్య

తుర్కయంజాల్: డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంతకు ముందు ఆయన తాండురు ఎమ్మెల్యే బి.మనోహర్ రెడ్డితో కలిసి తుర్కయంజాల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. తరువాత తొర్రూర్‌లోని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. అనంతరం వారితో వెళ్లి సీఎంను కలిసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ.. పేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం సాధ్యం అవుతుందని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి పంపించారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

డీడబ్ల్యూఓ పద్మజారమణ



మాట్లాడుతున్న పద్మజారమణ

చేవెళ్ల: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని డీడబ్ల్యూఓ పద్మజారమణ అన్నారు. చేవెళ్లలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో భారత ఎన్నికల కమిషన్ ఓటరు భాగస్వామ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. నడవలేని స్థితిలో, బెడ్‌పై ఉండే వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. అలాంటి వారు ఉంటే 12డీ ఫారం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం, తహసీల్దార్ కృష్ణయ్య, ఐసీడీఎస్ సీడీపీఓ శోభారాణి, ఐసీడీఎస్, రెవెన్యూ, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

అంబులెన్స్‌ల తనిఖీ



108 అంబులెన్స్ వాహనంలో తనిఖీ చేస్తున్న జిల్లా మేనేజర్ తదితరులు

కందుకూరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆవరణలో 108, 102 అంబులెన్స్‌లను మంగళవారం 108 అంబులెన్స్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్‌ల్లో అవసరమైన పరికరాలు, మందులు ఉన్నాయా అని పరిశీలించారు. ఆక్సిజన్ సరఫరా, రికార్డులను తనిఖీ చేశారు. ఫోన్ వచ్చిన వెంటనే స్పందించి, ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. వేసవిలో వడదెబ్బకు గురైన రోగులతో అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కోఆర్డినేటర్ రాజా బాబు సూచించారు. ఈఎంటీ కుమార్, పైలెట్లు యాదయ్య, గణేశ్ పాల్గొన్నారు.

భువనగిరి ఖిల్లాపై ఎర్రజెండా ఎగరేద్దాం

సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్

యాచారం: భువనగిరి ఖిల్లాపై ఎర్రజెండా ఎగరేద్దామని, సీపీఎం గెలుపుతోనే పేదలకు న్యాయం, ప్రశ్నించే తత్వంపై చైతన్యం పెరుగుతుందని ఆ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ అన్నారు. మండల పరిధిలోని గునుగల్‌లో మంగళవారం నిర్వహించిన పార్టీ మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి ఎంపీలుగా గెలిచిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు నియోజకవర్గాన్ని ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. భువనగిరి లోక్‌సభ పరిధిలో ప్రజలకు జీవనోపాధి కల్పించే ఏ ఒక్క ప్రాజెక్టు గానీ, పరిశ్రమ గానీ రాలేదన్నారు. ఏడేళ్ల క్రితం ప్రారంభించిన డిండి ప్రాజెక్టు నేటికీ పూర్తి కాలేదని గుర్తు చేశారు. ఉమ్మడి రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో పేదలకు వ్యవసాయ భూములు, ఇళ్లు, ఇంటి స్థలాలు దక్కాయంటే సీపీఎం పోరాటాల ఫలితమేనని ఆయన పేర్కొన్నారు. పార్టీ మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్ వెస్లీ, జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పగుడాల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సూరీడు@ 44.2



భానుడి భగభగలు

- రికార్డు స్థాయిలో పగటి ఉష్ణోగ్రతలు
- జిల్లాలోనే అత్యధికంగా ఫరూఖ్‌నగర్‌లో 44.2 డిగ్రీలు నమోదు
- ఎండలతో అల్లాడుతున్న జనం

సాక్షి, రంగారెడ్డిజిల్లా/షాద్‌నగర్: ఎండలు భగ్గున మండుతున్నాయి. మంగళవారం జిల్లాలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఫరూఖ్‌నగర్‌లో అత్యధికంగా 44.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, షాబాద్‌లో 42.7, మొయినాబాద్‌లో 42.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆమనగల్లు, నందిగామ, కడ్తాల్, కొందుర్గులో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండలు భగ్గున మండుతుండటంతో ఉపాధి హామీ కూలీలు, యాచకులు, టూ వీలర్‌పై ప్రయాణించే మార్కెటింగ్ సిబ్బంది, చిరుద్యోగులు, యాచకులు దాహంతో అల్లాడి పోతున్నారు. పలువురు వడదెబ్బకు గురయ్యారు. ఉపశమనం కోసం కొబ్బరి బొండాలు, పండ్ల రసాలు, ఇతర శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. సాధారణంగా భద్రాచలం, కొత్తగూడెం, నల్లగొండ జిల్లాల్లో నమోదయ్యే ఉష్ణోగ్రతలు ఈసారి మన జిల్లాలోనూ నమోదవుతుండడం విశేషం.

బీర్లకు ఫుల్ డిమాండ్

సాధారణ రోజులతో పోలిస్తే ప్రస్తుతం బీర్ల వినియోగం రెట్టింపైంది. వైన్స్ సహా బార్లలో చల్లని బీర్లు దొరకడమే కష్టమవుతోంది. రోజుకు సగటున 80 వేల కేసుల బీర్లు అవసరం కాగా, 70 వేల కేసులు మాత్రమే సరఫరా అవుతోంది. శీతల పానీయాల వినియోగం సైతం రెట్టింపైంది. సాధారణ రోజుల్లో రూ.30కే లభించిన కొబ్బరి బొండాం ప్రస్తుతం రూ.50 నుంచి రూ.60కి విక్రయిస్తున్నారు. ఇక పండ్ల రసాల ధరలూ అదే స్థాయిలో పెంచేశారు.

గిర్రున తిరుగుతున్న మీటర్లు

పగటి ఉష్ణోగ్రతలకు ఉక్కపోత తోడవడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఉపశమనం కోసం ఇంట్లోని ఏసీలు, కూలర్లు, రిఫ్రిజిరేటర్లు రోజంతా ఆన్‌లో ఉంచుతుండటంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. మీటర్లు గిర్రున తిరుగుతున్నాయి. సామర్థ్యానికి మించి విద్యుత్‌ను వినియోగిస్తుండటంతో సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నాయి. తరచూ ఫీడర్లు ట్రిప్పవుతుండటంతో పాటు జంపర్లు కట్ అవుతున్నాయి. ఫలితంగా సరఫరాలో అంతరాయం తప్పడం లేదు. అధికారులు ఒత్తిడికి లోనవుతున్న ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లను పర్యవేక్షిస్తున్నారు. సాంకేతిక సమస్య తలెత్తిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నారు.

మండలం	ఉష్ణోగ్రతలు
ఫరూఖ్‌నగర్	44.2
షాబాద్	42.7
మొయినాబాద్	42.3
కేశంపేట్	42.2
ఇబ్రహీంపట్నం	42.0
కందుకూరు	42.0
సరూర్‌నగర్	41.7
శేరిలింగంపల్లి	41.5
అబ్దుల్లాపూర్‌మెట్	41.4
రాజేంద్రనగర్	41.1
మంచాల	41.1
హయత్‌నగర్	40.9
చేవెళ్ల	40.9
శంకర్‌పల్లి	40.8
మహేశ్వరం	40.7
యాచారం	40.7
చౌదరిగూడ	40.6
బాలాపూర్	40.6
తలకొండపల్లి	40.4
శంషాబాద్	40.3
మాడ్గుల	40.1
ఆమనగల్లు	39.9
కొత్తూరు	39.9
నందిగామ	39.7
గండిపేట్	39.6
కడ్తాల్	39.5
కొందుర్గు	39.5



ఎండ అధికంగా ఉండటంతో మంగళవారం మధ్యాహ్నం షాద్‌నగర్ టోల్ ప్లాజా వద్ద పరిస్థితి

‘ఎర్లీ’గా కట్టేయండి

- ఐదు శాతం రాయితీ పొందండి
- మున్సిపాలిటీల్లో ‘ఎర్లీ బర్డ్’ పథకం
- ముందస్తు ఆస్తిపన్ను చెల్లింపునకు డిస్కౌంట్
- ఈనెల 30 వరకు వినియోగించుకునే అవకాశం



షాద్‌నగర్: ముందస్తుగా పన్ను చెల్లించే వారికి ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తోంది. పన్నులు చెల్లించే మొత్తం రాయితీని ప్రకటించింది. ఆస్తి పన్ను రాబట్టుకునేందుకు, మున్సిపాలిటీలకు ఆదాయాన్ని సమకూర్చేందుకు మున్సిపల్ శాఖ ఎర్లీబర్డ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ పథకంలో భాగంగా ముందస్తు పన్ను చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ కల్పించింది. ఈనెల 30 వరకు ఈ పథకం అమల్లో ఉంటుంది.

ఆదాయ వనరులు కీలకం

మున్సిపాలిటీ ద్వారా పౌరులకు అందించే సేవలు, నిర్వహణ, పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్ విభాగం ఒప్పంద కార్మికుల వేతనాలు, పారిశుద్ధ్య విభాగం నిర్వహణ, పౌర సేవలు సక్రమంగా కొనసాగాలంటే సొంత ఆదాయ వనరులు కీలకం. పన్నులు, ఇతర ఖాతాల ద్వారా సాధారణ నిధికి నిధులు జమకావాల్సి ఉంటుంది. ఇందులో జమయ్యే నిధుల్లో ప్రధాన వాటా ఆస్తి పన్నులదే. ఏటా ఏప్రిల్ నుంచి మార్చి వరకు ఏడాది కాలవ్యవధితో ఆస్తి పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ పన్నులను రెండు విడతలుగా చెల్లించేందుకు అవకాశం ఉంటుంది. పన్నుల రూపంలో వచ్చే నిధులను మున్సిపాలిటీ నిర్వహణతో పాటు అభివృద్ధి పనులు చేపట్టేందుకు వినియోగిస్తారు.

ముందస్తుగా చెల్లిస్తే..

ముందస్తు ఆస్తి పన్ను చెల్లింపుదారుల కోసం పురపాలక శాఖ ఎర్లీ బర్డ్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ఈనెల 1 నుంచే ప్రారంభమైంది. ఏప్రిల్ నుంచి మార్చి వరకు ఆర్థిక సంవత్సరానికి గాను ముందస్తుగా పన్ను చెల్లించే వారికి ఐదుశాతం రాయితీ కల్పించింది. ఈనెల 30లోపు చెల్లించే వారికి మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుంది. ఈ పథకంపై మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అధికారులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఆటోలను ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహిస్తున్నారు.

పెరగనున్న ఆదాయం

ఇళ్ల నిర్మాణాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో పన్నులు చెల్లించే వారి సంఖ్య సైతం ఏటా పెరుగుతోంది. జిల్లాలో మూడు కార్పొరేషన్లు, 13 మున్సిపాలిటీల్లో ఉన్న ఇళ్లు, వ్యాపార సముదాయాలకు ఎర్లీబర్డ్ పథకం వర్తిస్తుంది. దీంతో ప్రభుత్వ ఖజానాకు వచ్చే ఆదాయం పెరగనుంది. ఈ పథకానికి పట్టణాల్లో మంచి స్పందన లభిస్తోంది. ఇప్పటి వరకు ఈ పథకం కింద సుమారు పదిహేను శాతం వరకు పన్నులు వసూలయ్యాయి. మున్సిపల్ శాఖ ఆన్‌లైన్‌లో పన్నులు చెల్లించేందుకు అవకాశం కల్పించింది. ఈ నెలాఖరు వరకు పెద్ద మొత్తంలో పన్నులు వసూలవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



ఈ ఆర్థిక సంవత్సరానికి గాను ముందస్తుగా ఆస్తిపన్ను చెల్లించే వారికి ప్రభుత్వం ఎర్లీబర్డ్ పథకం కింద ఐదు శాతం రాయితీ ఇస్తోంది. ఈ పథకంపై ఇళ్ల యజమానులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ఈ నెల 30 వరకు చెల్లించే వారికి మాత్రమే రాయితీ లభిస్తుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– వెంకన్న, మున్సిపల్ కమిషనర్, షాద్‌నగర్

సద్వినియోగం చేసుకోవాలి



పన్నుల రూపంలో వచ్చే ఆదాయంతోనే ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంది. ముందస్తు పన్నులు చెల్లించే వారికి ప్రభుత్వం ఇచ్చే రాయితీని సద్వినియోగం చేసుకోవాలి. సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి.

– కొందూటి నరేందర్, మున్సిపల్ చైర్మన్, షాద్‌నగర్

కూలీలందరికీ పని కల్పించాలి

డీఆర్‌డీఓ శ్రీలత

కొందుర్గు: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలందరికీ పని కల్పించాలని డీఆర్‌డీఓ శ్రీలత సూచించారు. మండలంలోని పర్వతాపూర్, గంగన్నగూడ గ్రామాల్లో మంగళవారం ఆమె పర్యటించి ఉపాధి పనులతోపాటు నర్సరీలను పరిశీలించారు. అనంతరం ఉపాధి కూలీలతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా కూలీలు ఉదయం వేళల్లోనే పనులకు వెళ్లాలని సూచించారు. గతంలో రోజుకు రూ.272 కూలీ చెల్లించేవారని, ప్రస్తుతం ప్రభుత్వం రూ.300కు పెంచిందన్నారు. సరిపడా కొలతల ప్రకారం పనులు చేయాలని, నర్సరీల్లో మొక్కలు ఏపుగా పెరిగేలా చూడాలని, మొక్కలను సకాలంలో మల్చింగ్ చేయాలని సూచించారు.



కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శ్రీలత

అనంతరం కొందుర్గు మండలపరిషత్ కార్యాలయంలో గ్రామ ప్రత్యేకారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి శివలాల్, ఎంపీడీఓ ఆంజనేయులు, తహసీల్దార్ రమేష్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్య, ఏపీడీ శరణ్ గౌతమ్, ఎంపీఓ లాలయ్య, ఏపీఓ నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడలో లోక్‌సభ ఎన్నికలు

- 18 నుంచి నామినేషన్ల స్వీకరణ
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ శశాంక



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల తనిఖీల్లో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు రూ.2.61 కోట్ల నగదు, రూ.4.18 లక్షల విలువ చేసే 5.30 కిలోల వెండి, రూ.69 లక్షలకుపైగా విలువ చేసే 1,2591.63 లీటర్ల మద్యం, రూ.3.28 కోట్లకుపైగా విలువ చేసే డ్రగ్స్ సీజ్ చేసినట్లు కలెక్టర్ శశాంక వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం రాజేంద్రనగర్ రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఓటర్లను ప్రభావితం చేసే నగదు, మద్యం పంపిణీపై గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు.

- ఈ నెల 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుందని, ప్రతి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రాజేంద్రనగర్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఉంటుందని చెప్పారు.
- 26న నామినేషన్ల పరిశీలన, 29 వరకు ఉపసంహరణ, మే 13న ఎన్నికలు ఉంటాయన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు.
- కోడ్ ఉల్లంఘనలపై ప్రజలు నేరుగా 1950కు ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. సి–విజిల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు.
- 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. నోటిఫికేషన్ వెలువడిన ఐదు రోజుల్లోగా ఫాం12తో బీఎల్‌ఓలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.
- చేవెళ్ల లోక్‌సభ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని, వీటిలో 29,28,186 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. 2,824 పోలింగ్ కేంద్రాలతో పాటు 53 సహాయక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 13,443 మంది పోలింగ్ సిబ్బందిని నియమించినట్లు ప్రకటించారు.
- ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బందికి ఫాం12 అందజేసి, వారు ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రతి నియోజకవర్గంలో డిస్ట్రిబ్యూటర్ సెంటర్ ఉన్న చోటే.. రిసెప్షన్ సెంటర్ కూడా ఉంటుందన్నారు.
- కౌంటింగ్ కేంద్రం చేవెళ్లలోని బండారి శ్రీనివాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.



చిలుకూరు బాలాజీ దేవాలయం

వేడుకలకు వేళాయె..

- రేపటి నుంచి చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు
- ముస్తాబవుతున్న ఆలయం
- ఈనెల 25వ తేదీ వరకు ఉత్సవాలు

మొయినాబాద్: వీసా దేవుడు.. కలియుగదైవం చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలకు సిద్ధమయ్యారు. భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతూ.. తెలంగాణ తిరుపతిగా పేరొందిన ఆలయం వేడుకలకు ముస్తాబైంది. ఐదు శతాబ్దాల చరిత్ర కలిగిన దేవాలయంలో ఏటా శ్రీరామనవమి తరువాత దశమి రోజు నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అదే ఆనవాయితీ ప్రకారం ఈసారి కూడా ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 18 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమై 25 వరకు కొనసాగనున్నాయి.

తగిన ఏర్పాట్లు

చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలకోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల్లో స్వామి వారిని ఊరేగించే రథానికి మరమ్మతులు చేయించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి ప్రతి రోజు అందించే వాహన సేవలకు అవసరమైన వాహనాలను సిద్ధం చేస్తున్నారు. ఆలయ గోడలకు సున్నం, రంగులు వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పిస్తున్నారు.

18న అంకురార్పణ..

చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలకు ఈ నెల 18న (గురువారం) సెల్వర్ కూత్తుతో అంకురార్పణ జరగనుంది. మొదట పుట్టమన్ను తెచ్చి హోమగుండాలను ఏర్పాటు చేసి బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తారు. 19న ధ్వజారోహణం, శేషవాహన సేవలు అందిస్తారు. 20 స్వామివారికి గోపవాహన, హనుమంత వాహన సేవలు ఉంటాయి. 21న సూర్యప్రభ వాహనం, గరుడ వాహన సేవలు అందిస్తారు. అదే రోజు రాత్రి 10.30 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. 22 వసంతోత్సవం, గజవాహన సేవలు, 23న పల్లకీ సేవ, అర్ధరాత్రి 12 గంటలకు స్వామివారి దివ్యరథోత్సవం ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయి. 24న మహాభిషేకం, ఆస్థాన సేవ, అశ్వవాహన సేవ, దోప్‌సేవ, పుష్పాంజలి సేవలు చేస్తారు. 25న చక్రతీర్థం, ధ్వజావరోహణం కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

గరుడ ప్రసాదం వితరణ

బాలాజీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 19న ధ్వజారోహణ కార్యక్రమం చేపడతారు. ఈ సందర్భంగా గరుత్మంతునికి పెట్టే నైవేద్యాన్ని సంతానం లేని మహిళలకు ప్రసాదంగా వితరణ చేస్తారు. గరుడ ప్రసాదం తీసుకున్నవారికి సంతానం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తుండడంతో ప్రతి సంవత్సరం ఈ ప్రసాదానికి ఆదరణ పెరుగుతోంది. సుమారు 3వేల నుంచి 5 వేల మంది మహిళలు గరుడ ప్రసాదాన్ని స్వీకరిస్తున్నారు.

ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు



బాలాజీ బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 19న ధజారోహణం అనంతరం సంతానం లేని మహిళలకు గరుడ ప్రసాదం అందిస్తాం. గరుడ ప్రసాదంకోసం వచ్చే మహిళలు ఉదయం 8 గంటలలోపే ఆలయానికి చేరుకోవాలి.

– రంగరాజన్, ఆలయ అర్చకుడు

దారి తప్పిన ధరణి స్పెషల్ డ్రైవ్


యాచారం తహసీల్దార్ కార్యాలయం


స్పెషల్ డ్రైవ్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ధరణి కమిటీ సభ్యులు (ఫైల్)

- పెండింగ్‌లో భూ సమస్యల పరిష్కారం
- యాచారంలో 2,550 భూ పంచాయితీలు
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులు

యాచారం: పెండింగ్ భూ సమస్యల తక్షణ పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన ధరణి స్పెషల్ డ్రైవ్ దారి తప్పింది. ఇందులో ఏళ్లుగా మోక్షానికి నోచుకోని భూ సమస్యలు ఇక సత్వరమే పరిష్కారామవుతాయని ఎంతో ఆశపడిన అన్నదాతల ఆశలు నీరుగారిపోయాయి. దీంతో తమ భూ సమస్యలు పరిష్కరించాలని రైతులు నిత్యం కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరగడం పరిపాటిగా మారింది. కాంగ్రెస్ సర్కార్ ఏర్పాటైన వెంటనే మార్చి 1 నుంచి 9వ తేదీ వరకు పెండింగ్ భూ సమస్యల తక్షణ పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ధరణి స్పెషల్ డ్రైవ్ పెట్టింది. యాచారం మండలంలోని 24 గ్రామాల్లో వివిధ రకాల భూ సమస్యలు 2,550 ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. కానీ వాటిని పరిష్కరించేందుకుగాను తహసీల్దార్‌కు లాగిన్ ఇవ్వకపోవడం రైతులకు పెద్ద శాపంగా మారింది.

కొన్నింటికే లాగిన్లు

మండలంలోని మొత్తం భూ సమస్యలు 2,550 కాగా ఖాతా మర్జింగ్-9, జీఎల్ఎం-84, జీపీఏ-4 మ్యాడుళ్లలో కేవలం 97 భూ సమస్యలే ఉన్నాయి. వీటికి మాత్రమే లాగిన్లు చేయడానికి తహసీల్దార్‌కు అనుమతులు ఉన్నాయి. మార్చి 1 నుంచి నేటి వరకు తహసీల్దార్ లాగిన్ నుంచి ఆర్డీఓ, జిల్లా కలెక్టర్‌కు కేవలం 97 రకాల భూ సమస్యలే వెళ్లా యి. అవి కూడా పరిష్కారామయ్యాయా.. లేదా అనే విషయమై స్పష్టత లేకుండా పోయింది. వీటి లో అత్యధికంగా 1,557 టీఎం-33 భూ సమస్యలే ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటి పరిష్కారం పట్ల రైతులు రెవెన్యూ అధికారులను కలిస్తే ఎన్నికల కోడ్ ఉన్నందు వల్ల సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతుందని దాటవేస్తున్నారు.

సమావేశాలు నిర్వహించినా..

భూ సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించడం కోసం లీఫ్స్ సంస్థ(లీగల్ ఎంపవర్మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్స్ సొసైటీ) అధ్యక్షుడు డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో యాచారం మండలాన్ని పైలెట్ కింద తీసుకున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో లీఫ్స్ సంస్థ ప్రతినిధుల బృందం భూ న్యాయ శిబిరాలు నిర్వహించి 2,075 భూ సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. వాటిని పరిష్కరించే విధంగా కృషి చేయాలని లీఫ్స్ సంస్థ ప్రతినిధుల బృందం నివేదికను తహసీల్దార్ అయ్యప్పకు అందజేసింది. ప్రభుత్వం నియమించిన ధరణి కమిటీ సభ్యులైన ముదిరెడ్డి కోదండరెడ్డి, సునీల్‌కుమార్, లచ్చిరెడ్డిలు పలుమార్లు మండలాన్ని సందర్శించి రైతులతో మాట్లాడి, రెవెన్యూ అధికారులతో కూడా సమావేశమైనారు. కానీ పరష్కారం మాత్రం నేటికీ కాలేదు.

నిషేధిత జాబితాలో పెట్టారు



నక్కర్తమేడిపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వేనంబరు 272లో నా పేరు మీద 8 ఎకరాల వ్యవసాయ పట్టా భూమి ఉంది. ఈ భూమిని రెవెన్యూ అధికారులు నిషేధిత జాబితాలో పెట్టారు. పలుమార్లు తహసీల్దార్, ఆర్డీఓ, జిల్లా కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగినా పరిష్కారం కాలేదు. – బొగ్గుల పాపిరెడ్డి, రైతు, నక్కర్తమేడిపల్లి

త్వరలోనే పరిష్కరిస్తాం



మండలంలోని 24 గ్రామాల్లో 2,550 రకాల భూ సమస్యలు ఉన్నట్లు గుర్తించాం. కానీ మూడు రకాల భూ సమస్యల పరిష్కారానికి లాగిన్లు వచ్చాయి. మొత్తం 97 భూ సమస్యల పరిష్కారం కోసం లాగిన్ చేశాం. అన్ని రకాల సమస్యలపై రికార్డులను పరిశీలిస్తున్నాం. త్వరలోనే పరిష్కరించే విధంగా కృషి చేస్తాం. – అయ్యప్ప, తహసీల్దార్ యాచారం

ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ

రెండు తులాల వెండి సామగ్రి అపహరణ


వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి

షాబాద్: గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడిన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సీఐ కాంతారెడ్డి, ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సంకెపల్లిగూడ గ్రామానికి చెందిన ముద్దెంగూడ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య ఇంటి తాళాలు పగలగొట్టి దుండగులు లోపలికి చొరబడ్డారు. అర్ధరాత్రి బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు తలపై టోపీలు ధరించి చేతిలో ఖట్టర్ పట్టుకొని మొదటగా సీసీ కెమెరా వైర్లను తొలగించారు. సీసీ ఫుటేజ్ పరిశీలించగా ఈ దొంగతనానికి ఇద్దరు వచ్చినట్లు గుర్తించారు. కింద అంతస్తుకు తాళం వేసి పైన అంతస్తులో కుటుంబ సభ్యులు నిద్రిస్తున్నారు. దుండగులు యజమానులు నిద్రిస్తున్న తలుపునకు బయటి నుంచి గడియ పెట్టారు. లోపలికి వెళ్లి బీరువా తాళం సైతం పగుల గొట్టి అందులో ఉన్న వస్తువులను చిందరవందరగా చేశారు. అందులో ఉన్న రెండు తులాల వెండి వస్తువులను అపహరించారు. మంగళవారం ఉదయం ఇంట్లో పనిచేస్తున్న వ్యక్తి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి క్లూస్‌టీం బృందం చేరుకొని ఆధారాల సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసుల తెలిపారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి


కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ అధికారులు, ప్రజ్వల సిబ్బంది

ఐసీడీఎస్ సీడీపీఓ రోజా

కద్తాల్: మానవ అక్రమ రవాణాను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ సీడీపీఓ రోజా, ప్రజ్వల సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ బలరాం కృష్ణ పేర్కొన్నారు. మానవ అక్రమ రవాణాను నిరోధించడానికి, మహిళా శిశు సంక్షేమశాఖ, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో రెండు రోజులుగా అంగన్‌వాడీ సిబ్బందికి నిర్వహించిన శిక్షణా కార్యక్రమం మంగళవారం ముగిసింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ రోజా మాట్లాడుతూ.. నేటి సమాజంలో మానవ అక్రమ రవాణా కొత్త పద్ధతుల ద్వారా సైబర్ ట్రాఫికింగ్‌తో జరుగుతుందన్నారు. మొబైల్‌లో ఆన్‌లైన్ వాడుతున్న ఎవరైనా దీనికి గురయ్యే అవకాశం ఉందన్నారు. సమాజంలో ప్రధానంగా యువతతో పాటు, ప్రముఖులు కూడా ఇంటర్‌నెట్, మొబైల్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్ బారిన పడుతున్నారన్నారు. యువతులు సెల్‌ఫోన్‌లో వచ్చే రకరకాల యాప్స్‌తో లైంగిక వ్యాపారానికి గురికావడం జరుగుతుందని, ఫొటోస్ మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని తెలిపారు. మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో అంగన్వాడీలు ప్రత్యేక కృషి చేయాలన్నారు. మహిళలు, పిల్లలకు రక్షణ కవచంలా మారాలని సూచించారు. అనంతరం ప్రజ్వల సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ బలరాం కృష్ణ మాట్లాడుతూ.. ప్రజ్వల సంస్థ గత 28 ఏళ్లుగా లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా పోరాడుతుందని, ఇప్పటి వరకు 28,500 మంది మహిళలను కాపాడామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పద్మశ్రీ డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు శబరి, సరళ, ప్రజ్వల సిబ్బంది సురేశ్, అనిల్, అంబర్‌సింగ్, మిథాలీరాజ్, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం నూతన కార్యవర్గం నియామకం

రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షుడిగా టి.యాదీశ్

మహేశ్వరం: బీజేవైఎం రంగారెడ్డి జిల్లా రూరల్ నూతన కార్యవర్గాన్ని జిల్లా పార్టీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి మంగళవారం ప్రకటించారు. జిల్లా బీజేవైఎం అధ్యక్షుడిగా టి.యాదీష్(మహేశ్వరం), ఉపాధ్యక్షులు బొధ యాదగిరిరెడ్డి(తుక్కుగూడ), బాతుకు శ్రీనివాస్ యాదవ్(శంషాబాద్), కండె సా యి(ఆమనగల్),సూరంపల్లి రూపక్(ఇబ్రాహీంపట్నం) ర్యాకాల రాఘవేందర్(మీర్‌పేట్) బస్వ రాఘవేందర్(మహేశ్వరం), గోవర్ధన్‌రెడ్డి(శంషాబాద్) అమర్‌నాథ్‌రెడ్డి(మీర్‌పేట్), జనరల్ సెక్రటరీలుగా బూర దిలీప్ గౌడ్(కందుకూరు), రాజ మల్లేశ్(మొయినాబాద్), సెక్రటరీలుగా విజయ్(ఇబ్రహీంపట్న ం), మునావత్ దేవేందర్(మహేశ్వరం), ఓగ్గు ప్రభాకర్(ఆమన్‌గల్), శివ గౌడ్(మంచాల), మా రగోని శేఖర్(యాచారం), విశ్వనాథ్‌గౌడ్(బడంగ్‌పేట్), సందీప్ యాదవ్(షాద్‌నగర్), ఇంద్రాసేనారెడ్డి(చేవెళ్ల), నరేందర్ గౌడ్(యాచారం), అధికార ప్రతినిధులుగా కొత్తురు మహేందర్(షాబాద్), కారుకొండ ప్రదీప్(శంషాబాద్), జోల రమేష్ యా దవ్(మాడ్గుల), ప్రకాష్ గౌడ్(మహేశ్వరం), అగ్గి ప్రవీణ్(నందిగామ), దాసరి సందీప్ గౌడ్ (మంచాల), శివాజీ(కేశంపేట్), కోశాధికారులుగా మహేష్ చారి(ఆదిబట్ల), సాయిలు(మహేశ్వరం) నియమించారు. అదేవిధంగా వివిధ శాఖలకు సంబంధించి కార్యవర్గలను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు.

బీజేపీ జిల్లా ఎస్టీ మోర్చా..

సాక్షి, రంగారెడ్డి జిల్లా: భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా నూతన ఎస్టీ మోర్చా కమిటీని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు బానావత్ సాయిలాల్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షుడిగా జర్పుల శ్రీనునాయక్, లక్ష్మణ్‌నాయక్, బానావత్ మోతీలాల్ నాయక్, మేగావత్ హనుమంతు నాయక్, జర్పుల లక్ష్మణ్ నాయక్, కాట్రావత్ కృష్ణనాయక్, నేనావత్ రవి నాయక్, ప్రధాన కార్యదర్శులుగా మునావత్ గణేష్‌నాయక్, జటావత్ వినోద్‌నాయక్, కార్యదర్శులుగా కేతావత్ కుమార్ నాయక్, రమావత్ బాలు నాయక్, జటావత్ పంతునాయక్, రాత్లావత్ చందునాయక్, మేగావత్ మోహన్ నాయక్, కోశాధికారిగాకేతావత్ మోహన్‌నాయక్, సోషల్ మీడియా కన్వీనర్‌గా నందురాథోడ్, మీడియా కన్వీనర్‌గా జటావత్ నిరంజన్‌నాయక్, మహిళా విభాగం కన్వీనర్‌గా ధారావత్ భాగ్యలక్ష్మి నాయక్, అదే విధంగా స్పోక్ పర్సన్స్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌ను నియమించినట్లు సాయిలునాయక్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు, అభివృద్ధిని బూత్ స్థాయి ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో అభ్యర్థుల విజయం కోసం కార్యకర్తలను సమన్వయం చేయాలని పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ 'పట్నం' సమన్వయకర్తగా యాదగిరిరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం సమన్వయకర్తగా మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరెడ్డిని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు నియమించారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని ఎన్నికలకు సమాయత్తం చేయడానికి యాదగిరిరెడ్డి పని చేస్తారని తెలిపారు.

తనిఖీల్లో రూ.3.1 లక్షల పట్టివేత


నగదును సీఐ రాఘవేందర్‌రెడ్డికి అప్పగిస్తున్న ఎస్ఐ

ఇబ్రహీంపట్నంరూరల్: వాహనాల తనిఖీలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి నగదు తరలిస్తుండగా ఆదిబట్ల పోలీసులు పట్టివేశారు. ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా బొంగ్లూర్ అండర్‌పాస్ వద్ద ఓ వ్యక్తి వద్ద లక్ష రూపాయలు, వండర్‌లా సమీపంలో మరో వ్యక్తి వద్ద రూ.2.10 లక్షలు పట్టుబడినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న సొమ్మును సీఐ రాఘవేందర్‌రెడ్డికి అందజేశారు.

అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నివారణ

ఏడీఎఫ్ఓ రాజు


కరపత్రాలు పంపిణీ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

షాద్‌నగర్: అప్రమత్తంగా ఉంటే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని ఏడీఎఫ్ఓ రాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని పలు అపార్టుమెంట్‌లు, రద్దీ ప్రాంతాలో అగ్నిమాపక సిబ్బంది కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఎఫ్ఓ రాజు మాట్లాడుతూ.. ఎండాకాలం నేపథ్యంలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. ప్రజలందరూ అప్రమత్తతతో ఉంటేనే ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. ఏ చిన్న ప్రమాదం సంభవించినా వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు. తద్వారా తగిన చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అగ్ని ప్రమాదాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణ నష్టంతో పాటు ఆస్తి నష్టం సంభవిస్తుందని హెచ్చరించారు.

అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి


లక్ష్మణ్ (ఫైల్)

శంషాబాద్ రూరల్: అనుమానాస్పదస్థితిలో ఒకరు మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేబీ.దొడ్డి వాసి లక్ష్మణ్ (40) సోమవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఉదయం నిద్ర లేవకపోవడంతో కుటుంబ సభ్యులు గమనించగా.. అప్పటికే మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

భార్య, బంధువులపై అనుమానం..

లక్ష్మణ్ మృతిపై కుటుంబ సభ్యులు, స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అతని భార్య, వరసకు వదిన అయ్యే మహిళ, మరో వ్యక్తిపై అనుమానాలు ఉన్నాయంటున్నారు. రాత్రి మద్యం మత్తులో ఉన్న అతని మర్మాంగాలను గాయపర్చి చంపేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసు లు పారదర్శకంగా విచారణ చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలాఉంటే పోలీసులకు సమాచారం వెళ్లకుండా కొందరు స్థానిక ప్రజా ప్రతినిధులు మృతదేహానికి త్వరగా అంత్యక్రియలు నిర్వహించేందుకు పూనుకున్నట్లు ఆరోపణలు వినిపించాయి. అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా.. చివరి సమయంలో పోలీసులు ఎంట్రీ ఇవ్వడంతో సీన్ మారిపోయింది. ఇదిలా ఉండగా.. పోస్టుమార్టం రిపోర్టు వస్తే నిజాలు తెలుస్తాయని ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతానికి అనుమానాస్పద కేసుగా విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దారిదోపిడీ నిందితుల అరెస్టు

మణికొండ: పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న ఓ లారీ డ్రైవర్‌ను తమ ఆటోలో ఎక్కించుకుని కొట్టి అతని వద్ద రూ. 5,500లు చోరీకి పాల్పడిన ఘటన నార్సింగిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడకు చెందిన రాజు కోకాపేటలో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం తన ఓనర్ వద్ద రూ. 5,500 తీసుకుని సాయంత్రం ఏడు గంటల సమయంలో నడుచుకుంటూ కోకాపేట నుంచి నార్సింగి వైపు వస్తున్నాడు. అదే సమయంలో శేరిలింగంపల్లి మండలం, హాఫీజ్‌పేట్‌కు చెందిన సయ్యద్ ఫారూఖ్, సయ్యద్ మస్తాన్ అతడిని నార్సింగిలో దించుతామని ఆటోలో ఎక్కించుకున్నారు. కొద్ది దూరం వెళ్లగానే కొట్టి సెల్ ఫోన్, డబ్బును లాక్కుని ఆటోలో నుంచి కిందకు తోసి పారిపోయారు. దాంతో రాజు పోలీసులకు ఫిర్యాదు చేయగా సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించి మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి సెల్‌ఫోన్, డబ్బును రికవరీ చేసి, ఆటోను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

డీమ్డ్ వర్సిటీలో డాక్టరేట్‌ల ప్రదానం

చైతన్య యూనివర్సిటీలో కరుణశ్రీ, రేవతిలకు డాక్టరేట్


యూనివర్సిటీలో డాక్టరేట్ పొందిన కరుణశ్రీ

మొయినాబాద్‌రూరల్: కష్టపడి ఆవిష్కరించిన నూతన పరిశోధనలు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ కులపతి డాక్టర్ పురుషోత్తమ్‌రెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ సాత్వికరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని హిమాయత్‌నగర్‌లో ఆ యూనివర్సిటీలో మంగళవారం కరుణశ్రీ, రేవతిలకు డాక్టరేట్‌లు ప్రదానం చేశారు. కరుణశ్రీ ఆంగ్లంలో 'ఎన్‌హాన్సింగ్ ఎంప్లాయబిలిటీ స్కిల్స్ ఎమంగ్ ప్రొఫెషనల్ స్టూడెంట్స్ త్రూ ఈ లర్నింగ్' అనే అంశంపై ప్రొఫెసర్ జి.దామోదర్ పర్యవేక్షణలో ఆమె పరిశోధన చేశారు. అదే విధంగా సూక్ష్మ జీవశాస్త్రంలో 'స్టడీస్ ఎట్ ఐసోలేషన్ అండ్ స్క్రీనింగ్ ఆఫ్ యాంటీ బయోఫిల్మ్ మెటాబోలైటిస్ ఫ్రామ్సన్ సెలక్టడీ మెడిసినల్ ప్లాంట్స్ మహబూబ్‌నగర్ జిల్లా తెలంగాణ రాష్ట్ర' అనే అంశంపై ప్రొఫెసర్ అనురాధ పర్యవేక్షణలో రేవతి పరిశోధన చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ కులపతి డాక్టర్ పురుషోత్తమ్‌రెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటర్ అధికారి డాక్టర్ సాత్వికరెడ్డిలు వీరిని అభినందిస్తు డాక్టరేట్ పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య రవీందర్, ప్రొఫెసర్ కవిత, రిసర్చ్ డీన్ ఆచార్య కిస్టఫర్, డీన్ సైన్స్ ప్రొఫెసర్ సుందర్‌రామ్, అడ్మినిస్ట్రేషన్ రాజు, డిప్యూటీ కంట్రోలర్స్ పబ్లిక్ రిలేషన్ అధికారి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ల బైండోవర్

- లోక్ సభ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత
- అధికారులకు సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆదేశాలు

సాక్షి, సిటీబ్యూరో: గత ఎన్నికల సమయంలో ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకుని రౌడీ షీటర్లతో పాటు సస్పెక్ట్, హిస్టరీ షీట్లు ఉన్న వారిని ముందస్తుగానే బైండోవర్ చేయాలని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి అధికారులను ఆదేశించారు. ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో విధిగా పర్యటిస్తూ నిఘా పెట్టాలని సూచించారు. త్వరలో జరగనున్న లోకసభ ఎన్నికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన భద్రత ఏర్పాట్లపై మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం నియంత్రణలో క్రమశిక్షణతో పని చేయాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని సూచించారు. అక్రమం డబ్బు, మద్యం తరలింపు, ఉచితాలపై నిఘా పెట్టాలని, అవసరమైన చోట మరిన్ని చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల విధులకు సంబంధించిన నిర్దిష్టమైన సూచనలను తమ కింది స్థాయి సిబ్బందికి అందించాలన్నారు. సమావేశంలో జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయల్ డేవిస్, డీసీపీలు జీ వినీత్, నితికా పంత్, నారాయణరెడ్డి, శ్రీనివాసరావు, శ్రీనివాస్, కే ప్రసాద్, సృజన కర్ణం, నర్సింహా కొత్తపల్లి, సాయిశ్రీ, డీవీ శ్రీనివాసరావు, డీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కులిచ్చిన వారిపై ఎఫ్ఐఆర్‌లు

చర్యలు చేపట్టిన జీహెచ్ఎంసీ

సాక్షి,సిటీబ్యూరో: చెక్ 'బౌన్సర్ల'పై జీహెచ్ఎంసీ చర్యలు చేపట్టింది. ఆస్తిపన్ను చెల్లింపుల కోసం చెల్లని చెక్కులిచ్చిన వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది. ఇటీవల ముగిసిన ఆర్థిక సంవత్సరానికి(2023–24) జీహెచ్ఎంసీకి మొత్తం రూ.1921 కోట్లు ఆస్తిపన్నుగా వసూలైంది. అందులో చెక్కుల ద్వారా జరిగిన చెల్లింపుల్లో రూ.11 కోట్ల మేర చెక్కులు బౌన్సయినట్లు అధికారులు గుర్తించారు. సర్కిళ్ల వారీగా అలాంటి చెక్కులిచ్చిన వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు కమిషనర్ రోనాల్డ్‌రాస్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ సర్కిల్‌లో 5, శేరిలింగంపల్లిలో 4, చందానగర్‌లో 13, యూసుఫ్‌గూడలో 8, కుత్బుల్లాపూర్‌లో 4, కూకట్‌పల్లిలో 1, మూసాపేటలో 4 ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇలాంటి వారు ఇంకా ఉన్నారు. జీహెచ్ఎంసీకి చెల్లని చెక్కులిచ్చిన వారు బౌన్సయిన చెక్ తాలూకు నగదును వెంటనే చెల్లించాలని, లేని పక్షంలో ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేయనున్నట్లు హెచ్చరించారు. ఇకపై ఆస్తి పన్ను చెల్లించే వారు చెక్‌బౌన్స్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆస్తిపన్ను బకాయిలున్న వారు వాటిని చెల్లించి ప్రస్తుతం అమల్లో ఉన్న ఎర్లీబర్డ్ పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఎర్లీబర్డ్ ద్వారా 5 శాతం రాయితీకి ఈనెల 30 వరకు గడువు ఉంది.